క్లుప్తంగా

కేసు నమోదు

ధరూరు: ఎదురెదురుగా వస్తున్న కారు–డీసీఎంలు ఢీ కొన్న ఘటనలో కేసు నమోదు చేసినట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. వనపర్తి జిల్లా నాగవరానికి చెందిన జింకల నరేందర్ తన కారులో ఈ నెల 5వ తేదీన దైవ దర్శనం కోసం మంత్రాలయం వెళ్తున్నాడు. గద్వాల–రాయచూర్ మార్గ మధ్యలో కోతులగిద్ద స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలైనట్లు కారు యజమాని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

10న మండల సర్వసభ్య సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి రాఘవ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రాదేశిక సభ్యులు, ఆయా శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పత్తికి రూ.12వేలు మద్దతు ధర ఇవ్వాలి



గద్వాల అర్బన్: పత్తి క్వింటాల్‌కు రూ.12వేలు మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు శివన్న డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. గులాబీ రంగు పురుగుతో వేలాది ఎకరాల పంట నష్టం జరిగిందన్నారు. గద్వాలలో పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు సెంటర్లను ఏర్పాటు చేయడం లేదని, దీంతో రైతులు తక్కువ ధరకు పత్తిని దళారులకు అమ్ముకొని మోసపోతున్నారన్నారు. వెంటనే ఎలాంటి నిబంధన లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సవారి, వివి నర్సింహ్మ, మోష, సీతారాములు, తిమ్మప్ప, ఆంజనేయులు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు పూర్తిగా ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలకు సగం వరకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు, పందులు, మేకలు సంచరిస్తూ పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల ఎదుట గద్వాల–అయిజ ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని, అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు సీపీఎం జిల్లా కమిటీ సమావేశం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. అలంపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయుడిని నియమిస్తూ మంత్రి కేటీఆర్ బీఫాంను అందించడంతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎర్రవల్లి కూడలిలో పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు.

గద్వాలకు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా/ధరూర్: ఇటిక్యాల, ఎర్రవల్లి మండల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నా యకులు, కార్యకర్తలు గద్వాలకు తరలి వెళ్లారు. ధరూర్ మండలానికి చెందిన సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో జనం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ధరూరులో గొంగ్లళ్ల రంజిత్ కుమార్ సతీమణి గొంగ్లళ్ల సాహితి ప్రచారం నిర్వహించారు.

ఉండవెల్లి: అలంపూర్ నియోజకవర్గంలో బీఎస్పీని గెలిపిస్తే ఉచిత వైద్యం అందిస్తామని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కేశవరావు అన్నారు.

రహదారులకు మోక్షమెప్పుడో?

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ఎల్కూర్ - చర్లగార్లపాడు గ్రామాల మధ్యనున్న రోడ్డుపై తేలిన కంకర

మల్దకల్: రహదారులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామీణ ప్రాంతాలకు బీటీ రహదారులు మంజూరు చేస్తోంది. అందులో భాగంగానే 2018లో అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు పెద్దపల్లి నుంచి పావనంపల్లి వరకు రూ.1.39కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఎల్కూరు నుంచి ఈదులపల్లి, చర్లగార్లపాడు మీదుగా నీలిపల్లి స్టేజీ వరకు రూ.4కోట్లతో బీటీ రహదారి పనులను ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి ఆరేళ్లు గడిచినా రహదారులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర వేసి వదిలేయడంతో రోడ్లపై నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు నిధులు రాకపోవడంతో పనులను అర్ధాంతరంగా వదిలేశారు. కంకర తేలిన దారిలో రాకపోకలు సాగించలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాలకు గురికాకుండా చూడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



పెద్దపల్లి నుంచి పావనంపల్లి వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రహదారి కోసం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఆరేళ్లవుతుంది. కంకర వేసి దానిని రోలింగ్ కూడా చేయకుండా వదిలేయడంతో ఆ రహదారిపై ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– జయన్న, పావనంపల్లి

రాకపోకలకు ఇబ్బంది..



ఎల్కూరు నుంచి చర్లగార్లపాడు మీదుగా నీలిపల్లి స్టేజీ వరకు ఏర్పాటు చేయనున్న బీటీ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాం. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– కాంతారెడ్డి, చర్లగార్లపాడు

నిధుల్లేక పనులు నిలిచాయి..



మండలంలోని ఆయా గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు నిలిచిపోయాయి. 50 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని నిధులు మంజూరైన వెంటనే మిగతా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు.

– భరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ

జోగుళాంబ ఆలయంలో రేవంత్ పూజలు



రేవంత్ రెడ్డికి జోగుళాంబ అమ్మవారిని జ్ఞాపకను బహుకరిస్తున్న ఈఓ, చైర్మన్, సిబ్బంది

జోగుళాంబ శక్తిపీఠం/అలంపూర్ రూరల్/ శాంతినగర్: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాన్ని మంగళవారం రాష్ట్ర తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్‌లు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ కమిటీ ధర్మకర్తలు జల్లాపూర్ వెంకటేశ్వర్ రెడ్డిలు స్వాగతం పలికారు. అనంతరం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని, కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలతో పాటు అమ్మవారి జ్ఞాపిక, శేషవస్త్రాలను అందజేశారు.

షా అలీ పహిల్వాన్ దర్గాలో ప్రార్థనలు

ఆలయాలకు సమీపంలో ఉన్న షా అలీ పహిల్వాన్ దర్గాలో ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిలు ప్రార్థనలు నిర్వహించి మతసామరస్యతను పాటించారు. శాంతినగర్‌లో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

కొనసాగుతున్న పీపీఆర్ టీకాలు



అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మంగళవారం మండలం కేంద్రంలో, మూగోనిపల్లి, పర్దీపురం గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 3391 గొర్రెలకు, 80 మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. గొర్రెలు, మేకల యజమానులు మూగజీవాలకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని కోరారు.

ఆస్పత్రి సిబ్బందిపై విచారణ



ఆస్పత్రి సిబ్బందిని విచారిస్తున్న శశికళ

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది రోగుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో విడియో దృశ్యాలపై మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారిణి శశికళ విచారణ చేపట్టారు. సోమవారం రాత్రి గట్టు మండలం గోర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రాజేశ్వరి ఐదో ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చారు. సోమవారం రాత్రి ఆమె తరుపు బంధువులు ప్రసవ వార్డులో ఉన్నారు. మహిళలు మాత్రమే ఉండాల్సిందిగా సెక్యూరిటీ సిబ్బంది వారికి చెప్పారు. డ్యూటీ డాక్టర్లు వచ్చే సమయం కావడంతో బయటకు వెళ్లాల్సిందిగా గట్టిగా మందలించారు. దీంతో తనను బయటకు సెక్యూరిటీ సిబ్బంది బలవంతగా నెట్టేసి, ప్రసవం కోసం వచ్చిన మహిళను పట్టించుకోవడం లేదని విడియో తీసి పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశాడు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ వైద్యాధికారిణి విధుల్లో ఉన్న సిబ్బంది, సెక్యూరిటీపై విచారణ చేపట్టారు. బాధిత మహిళ, కుటుంబ సభ్యులను సైతం విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన సంఘటనపై ఆసుపత్రి సూపరిండెంట్ కిషోర్ కుమార్‌తో మాట్లాడి బాధ్యులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అమె తెలిపారు. అయితే గత వారం రోజుల క్రితం రోగులకు మందులు అందిచే ఫార్మసిస్టులు సైతం రోగుల పట్ల దురుసుగా వ్యవహరించారనే ఆరోపణలపై నివేదికాలు అందజేయాల్సిందిగా ఆసుపత్రి సిబ్బందికి అదేశాలు జారీ చేశారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



శాంతినగర్: ఈనెల 30న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరు వారి ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ నరేష్ అన్నారు. శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరు, కొంకల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక పోలీసులతోపాటు ప్రత్యేక బలగాలు ఆయా గ్రామాల్లో కవాతులో పా ల్గొన్నాయి. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి, కానిస్టేబుల్ ప్రకాశం పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు తొలిమెట్టుపై అవగాహన



కరపత్రాలు విడుదల చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమం ద్వారా మంగళవారం విద్యార్థినీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క ళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమంలో పేర్లను నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ప్రతి శనివారం దగ్గర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హాజరై అక్కడి విద్యార్థులకు విద్యభ్యాసన, వాటి సామర్థ్యలను పెంపొందించే విధంగా ఆటపాటలతో సృజనాత్మక పద్ధతులతో బోధించాలన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జగన్‌మోహన్ అవగాహన కల్పించారు.

వాల్‌పోస్టర్ విడుదల



గద్వాలలో విశ్వరూప మహాసభ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్/అయిజ/ధరూర్/కేటీదొడ్డి/మానవపాడు: 11న హైదరాబాద్‌లోమాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అశోక్, జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్‌లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సభకు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అయిజలో ఉత్తనూరు, తొత్తనోనిదొడ్డి, కొత్తపల్లి గ్రామాల్లో కరపత్రాలు విడుదల చేశారు. ధరూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీనియర్ నాయకులు చింతరేవుల ఆంజనేయులు, రాములు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాలలో పోస్టర్ విడుదల చేశారు. మానవపాడు మండల కేంద్రంలో విశ్వరూప మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. ఆయా మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్లీనర్‌కు తీవ్ర గాయాలు

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు క్లీనర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం గద్వాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన్యం జిల్లా పార్వతీపురం గ్రామానికి చెందిన జె వెంకట్‌నాయుడు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. గద్వాల మున్సిపాలిటీ సమీపంలో సాయంత్రం లారీని డ్రైవర్ ముందుకు తీసే క్రమంలో రోడ్డు మార్గంలో ఎలాంటి సమస్యలు కలుగకుండా క్లీనర్ డ్రైవర్‌కు సూచనలు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు లారీ కింద క్లీనర్ పడడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

పెబ్బేరు రూరల్: పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థులు మాట్లాడుతూ శ్రీరంగాపురం పాఠశాల, పెబ్బేరులోని మో డల్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు అనుగుణంగా ఉదయం, సాయంత్రం సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమయానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. విద్యార్థుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న మేనేజర్ స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తాని హామీనిచ్చారు. విద్యార్థులు డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌వి ఘరానా మోసాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: కాంగ్రెస్ పార్టీ చెప్పే గ్యారంటీలు కాదని, అవి ప్రజల ఘరానమోసాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ అవినీతి, వలసలు, అంధకారం, రైతు ఆత్మహత్యలు, దళితులపై దాదులుగా ఆరు ఘరానమోసాలని అభివర్ణించారు. ఆనాడు తెలంగాణను నిండాముంచిన పార్టీ కాంగ్రెస్ అని ఇప్పుడు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గత పదేళ్లలో పచ్చబడితే చూసి ఓర్వలేక మళ్లోసారి నాశనం చేయాలని కుట్రలు చేస్తున్నట్లు మండిపడ్డారు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ పార్టీ నిరంతరాయంగా ఉచిత విద్యుత్, దళితబంధు, రైతుబంధు, రైతుబీమా, గొర్రెల పంపిణీ, మైనార్టీ బంధు, బీసీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు. ప్రజల దయ వల్ల రెండుసార్లు అధికారంలో వచ్చిన కేసీఆర్ అహర్నిషలు కష్టపడి పనిచేస్తున్నారని, మరోసారి సీఎం కేసీఆర్‌ను, ఇక్కడ నన్ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయన గద్వాల నియోజకవర్గంలోని పలుమండలాలు, పట్టణంలోని పలువార్డులకు చెందిన వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, పటేల్ ప్రభాకర్ రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న జిల్లా విద్య సమన్వయ కర్త ఏస్తేరు రాణి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో మంగళవారం ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోల్ ప్లే కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పౌష్టికాహారంపై ప్రదర్శన నిర్వహించి మొదటి బ హుమతి రూ.1500లు పొందారు. మండలంలోని పూడురు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఇంటర్నెట్ సద్వినియోగంపై రోల్ ప్లే చేసి రెండో బహుమతి, గట్టు మండలంలోని అలూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు మూడో బహుమతి, మెడికొండలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు జిల్లా విద్య సమన్వయ అధికారి ఏస్తేరు రాణి బహుమతులను అందజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సమస్యలను చాలా వరకు పరిష్కారం విద్యార్థుల చేతిలో ఉందని, విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడమేగాక తమ కుటుంబ సభ్యులను చైతన్యం చేయాలన్నారు.

విద్యపై ప్రత్యేక అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఉండవెల్లి: జీవశాస్త్రంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించి ప్రత్యేక బోధన అవసరమని, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌లో మూత్రపిండాలకు రక్తం ఎలా ప్రసరించబడుతుందనే దానిపై వైద్యులు విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఉపాధ్యాయులు రవిశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లూరులోని విద్యార్థులకు విద్యను మరింత నైపుణ్యంగా, అర్థమయ్యేలా తెలిపేందుకు జీవశాస్త్ర ఉపాధ్యాయులు రవి శంకర్ ప్రత్యేక బోధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు గోపాల్, ఎల్లమ్మ, పాల్గొన్నారు.

తిరుమలలో ఉత్తనూర్ భక్తుల సంకీర్తనలు



సంకీర్తనలు పాడుతున్న భజన మండలి సభ్యులు

అయిజ: తిరుమల తిరుపతి దేవస్థాన కమిటీ ఆహ్వానం మేరకు జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ఉత్తనూరుకు చెందిన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి భజన మండలి మంగళవారం తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి కీర్తనలు ఆలపించారు. ప్రతి సంవత్సరం తిరుమలలో హరినామ సంకీర్తనల కార్యక్రమంలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తుందని భజన మండలి సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు తిరుమలేష్, సభ్యులు వసూరప్ప, లక్ష్మన్న, ఉత్తనూరప్ప, రామాంజనేయులు, శ్రీను, రాముడు, వీరేష్, పరుశరాముడు, రవి పాల్గొన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి



అయిజలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు సీవీ రామన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ మాట్లాడారు. ఈతరం విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ కలిగేలా స్ఫూర్తిని నింపిన మహనీయుడు, నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయ శాస్త్రవేత్త సర్ చంద్రశేఖర్ వెంకటరామన్ అని కొనియాడారు. వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బురపరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా సీవీ రామన్ నిలిచారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్ రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్ ఆచారి, ఆది, కృష్ణ పాల్గొన్నారు.